APTEL/25/A2844

# క్రైమ్ కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం
తెలుగు దిన పత్రిక

సంపుటి : 01 సంచిక : 24 క్రిష్ణా, శనివారం 18- 10 - 2025 పేజిలు : 4 వెల. 2 /-

రిపోర్టర్లు కావలెను
క్రైమ్ కౌంటర్
తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్టంలో
- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు
కావలెను.
సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు
98497 07349

## రాజకీయ వ్యవస్థలో యువతను భాగస్వామ్యం చేస్తాం:



**అమరావతి, అక్టోబర్ 17 క్రైమ్ కౌంటర్ న్యూస్ :** : రాజకీయ వ్యవస్థలో నవతరం యువతను భాగస్వామ్యం చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. సమాజంలో మార్పు కాంక్షించే ప్రతి ఒక్కరికీ వారి వంతు సేవలు మాతృభూమికి అందించే అవకాశం కల్పించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు పవన్ కల్యాణ్.ఇందులో భాగంగా 'సేనతో సేనాని- మన నేల కోసం కలిసి నడుద్దాం' అంటూ ఒక వినూత్నమైన కార్యక్రమాన్ని జనసేన నిర్వహించనుందని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా ఔత్సాహిక యువతీ, యువకులు తమకు నచ్చిన అంశాన్ని ఎంచుకుని సేవలు అందించే అవకాశాన్ని ఈ వేదిక కల్పించనుందని తెలిపారు. మార్పు కోరుకుంటే రాదని.. మార్పు కోసం ప్రయత్నిస్తే వస్తుందని ఉద్ఘాటించారు. ఈ ప్రయత్నంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాలుపంచుకునేందుకు %ు=% కోడ్ స్కాన్ చేసి, లేదా లింక్ మీద క్లిక్ చేసి ఇప్పుడే రిజిస్టర్ చేసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు.



# GST సభ అదుర్స్

**అమరావతి, అక్టోబర్ 17 క్రైమ్ కౌంటర్ న్యూస్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటన విజయవంతమైందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మంత్రులు, వివిధ శాఖల అధికారులను సీఎం చంద్రబాబు అభినందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీలో ప్రధాని నాలుగోసారి పర్యటించారని తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వివిధ కార్యక్రమాల్లో మోదీ పాల్గొన్నారని చెప్పుకొచ్చారు సీఎం చంద్రబాబు. ప్రధాని మోదీ పర్యటనలో భాగంగా కర్నూలు జిల్లాలో నిర్వహించిన సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ బహిరంగ సభ గ్రాండ్ సక్సెస్ అయ్యిందని ఉద్ఘాటించారు. ఈ సభ మంచి మెసేజ్ ఇచ్చిందని నొక్కిచెప్పారు. ప్రధాని మోదీ పర్యటనలో అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేశారని ప్రశంసించారు. ప్రధాని మోదీ సైతం పర్యటనను ఎంతో ఆస్వాదించారని పేర్కొన్నారు. శ్రీశైలం మల్లన్న ఆలయ దర్శనంపై ప్రధాని ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని వ్యక్తం చేశారని అన్నారు. ప్రధాని మోదీ సైతం సూపర్ జీఎస్టీ కార్యక్రమాలను అభినందించారని తెలిపారు. జీఎస్టీపై నెల రోజులపాటు చేసిన కార్యక్రమాలపై సమగ్రంగా ఒక పుస్తకాన్ని ప్రచురించాలని సీఎం చంద్రబాబు సూచించారు.

## మద్యం ఇక 'సురక్ష'తం..

**అనంతపురం, అక్టోబర్ 17 క్రైమ్ కౌంటర్ న్యూస్ :** నాణ్యమైన మద్యమే వినియోదారుడికి చేరాలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కొన్న వెంటనే దుకాణం వద్దే మద్యం చెక్ చేసుకునేందుకు వీలు కల్పించింది. ఈక్రమంలోనే ఓ సరికొత్త యాప్‌ను తీసుకువచ్చింది. దీని ద్వారా వినియోగదారుడు తాను కొనే మద్యం అసలైందా .. లేక నకిలీదా అనే విషయ ం అక్కడికక్కడే తెలిసిపోతుంది. యాప్ ద్వారా స్కాన్ చేస్తే చాలు తాను కొన్న లిక్కర్ బాటిల్ సమస్త వివరాలు కస్టమర్ కళ్ల ముందు కనిపించేలా ఈ యాప్‌ను రూపొందించారు. దాని ధర..? ఎక్కడ తయారైంది...?, ఏ బ్రాండ్..? ఏ డిపో నుంచీ సప్లై చేశారు..? ఇలా అన్ని వివరాలు ఇట్టే తెలిసిపోతాయి. ఇదే ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్. విపక్షాలు చేస్తున్న నకిలీ మద్యం గగ్గోలుకు, ఇతర ప్రశ్నలకు ఈ యాప్ సమాధానం చెప్పనుంది. ఇది అటు కస్టమర్లు తాము తాగే లిక్కర్ నాణ్యతను తెలుసు కునేందుకు, రిటైల్ దుకాణ దారుల అమ్మకాలు తెలుసుకోడానికి ప్రభుత్వం దీన్ని తీసుకొచ్చింది. సులభంగా వా డొచ్చు ఎవరైనా ఈ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను సులభంగా వాడొచ్చు. కస్టమర్లు తమ ఆండ్రాయిడ్ ఫోన్లలోని ప్లే స్టోర్‌లోకి వెళ్లి ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలి. యాప్ ఇన్‌స్టాల్ అవగానే కస్టమర్, రిటైలర్ ఆప్షన్లు చూపుతుంది. కస్టమర్ ఆప్షన్ ఎంపిక చేయాలి. తర్వాత కస్టమర్లు తాము కొనుగోలు చేసే బాటిల్‌పై ఉన్న హీల్ స్టిక్కం (హోలోగ్రామ్)ను యాప్‌లోని స్కానర్ ద్వారా స్కాన్ చేయగా...కింద సెక్యూరిటీ కోడ్(క్యాప్చా)ను ఎంటర్ చేయగానే ఆ బాటిల్ వివరాలు అన్నీ ప్రత్యక్షం అవుతాయి.



## మెడికల్ కాలేజీలను పీపీపీతో చేస్తే తప్పేంటి?

**విజయవాడ, అక్టోబర్ 17 (క్రైమ్ కౌంటర్ న్యూస్ :** పీపీపీ మోడల్‌లో మెడికల్ కళాశాలల నిర్మాణం వల్ల నష్టం లేదని మంత్రి సత్యకుమార్ యాదవ్ మరోసారి స్పష్టం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ అసత్య ప్రచారంతో రాద్ధాంతం చేస్తుందని మండిపడ్డారు. 33 యేళ్ల తరువాత మళ్లీ ప్రభుత్వానికి ఆ కళాశాలు చెందుతాయని.. మెడికల్ కళాశాలలు పూర్తి అయితే 1500 సీట్లు వస్తాయని.. ఇందులో 725 సీట్లు పూర్తిగా ఉచితమని ప్రకటించారు. ఎన్టీఆర్ వైద్య సేవల కింద కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నామన్నారు. మెడికల్ కళాశాలలను అందుబాటులోకి తెస్తే ప్రజలకు మంచి జరుగుతుందని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి చేయాలనే అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రజలకు ప్రతి చోటా మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు మంత్రి. జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు ఏదో మాట్లాడుతూ అసత్యాలు ప్రచారం



చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 108, 104లను ప్రైవేటు వ్యక్తులతో నడిపారని గుర్తుచేసిన మంత్రి.. మెడికల్ కళాశాలలను ప్రైవేటు పార్టనర్ షిప్‌తో చేస్తే తప్పేంటి అని ప్రశ్నించారు. అసెంబ్లీకి రా చర్చిద్దాం అంటే వచ్చే ధైర్యం లేదని విమర్శించారు. రిషికొండలో వందల కోట్లు తో భవనాలు నిర్మించారని.. మరి ఈ మెడికల్ కళాశాలలు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు.ప్రజలు చదువకుండా యువత మేదో సంపత్తిని జగన్ నాశనం చేశారని మండిపడ్డారు. నర్సీపట్నంలో మెడికల్ కళశాలను జగన్ నిర్మించలేదని.. ఐదు వందల కోట్లు అయితే జగన్ ఖర్చు పెట్టింది ఇరవై కోట్లు మాత్రమే అని తెలిపారు. మెడికల్ కళాశాలకు ఆయన ఇచ్చే నిర్వచనం ఏమిటో జగన్‌కే అర్థం కాదంటూ దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతే ఈ మెడికల్ కాలేజీల నిర్మాణ పనులు మొదలయ్యాయని పేర్కొన్నారు. ప్రజలను తక్కువ అంచనా చేసిన జగన్‌కు తగిన గుణపాఠం చెప్పారని.. అయినా ఇంకా పాత పద్ధతిలోనే జగన్ వెళుతున్నారని విమర్శించారు. సెల్ఫ్ ఫైనాన్స్ స్కీం తెచ్చింది జగనే అని.. ఇప్పుడు ఆయనే విమర్శిస్తున్నారని అన్నారు. బీజేపీ అధికార ప్రతినిధులపై గురుతర బాధ్యతలు ఉన్నాయన్నారు. ఏ అంశం మాట్లాడినా ఆ విషయంపై పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. ఆగ్రహం, ఆనందం, ఆవేదన అయినా మీడియా సమావేశాల్లో, సభల్లో ముఖంలో కూడా కనిపించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

## 15 ఏళ్ల పాలనతో 50 ఏళ్లు వెనక్కి నెట్టేశారు



**పాట్నా, అక్టోబర్ 17 క్రైమ్ కౌంటర్ న్యూస్ :** ఆర్జేడీ సుప్రీం లాలూప్రసాద్ హయాంలో బిహార్‌లో 15 ఏళ్ల పాటు 'ఆటవిక రాజ్యం' సాగిందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. దీంతో రాష్ట్రం అర్ధశతాబ్దం వెనక్కి వెళ్లిపోయిందని, ఆ సమయంలో బిహార్ గౌరవం, వైభవం, ప్రతిభ వంటివన్నీ కోల్పోయాయని తెలిపారు. ఇప్పుడు ఇదే 'జంగిల్ రాజ్' కొత్త ముఖాలతో ప్రజల ముందుకు వస్తోందని తేజస్వి యాదవ్‌పై పరోక్షంగా విమర్శలు గుప్పించారు బిహార్‌లోని పాట్నాలో శుక్రవారం నాడు జరిగిన మేథావుల సదస్సులో అమిత్‌షా మాట్లాడుతూ, ఆర్జేడీ ఆటవిక పాలనతో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బిహార్‌లో ఏర్పాటు చేసిన పరిశ్రమలన్నీ రాష్ట్రాన్ని వదిలిపోయాయని చెప్పారు. అవినీతి కేసులో జైలు నుంచి లాలూ ప్రసాద్ వచ్చినప్పుడు ఏనుగుపై ఊరేగింపు జరిపారని, ఇదెంత సిగ్గుచేటు వ్యవహారమో మనం ఊహించలేమని అన్నారు. బిహార్‌లో అప్పట్లో మీరు 6 విడతల్లో ఎన్నికలు నిర్వహించిన విషయం లాలూ, రాహుల్ కంపెనీకి గుర్తుందా? అని అమిత్‌షా ప్రశ్నించారు. భద్రతా ఏర్పాట్లను దృష్టిలో ఉంచుకుని ఆర్జేడీ హయాంలో 6 విడతల్లో ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చిందని, బిహార్ ఇప్పుడు సురక్షితంగా ఉన్నందునే కేవలం రెండు విడతల్లోనే ఎన్నికలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కాగా, 243మంది సభ్యుల బిహార్ అసెంబ్లీకి రెండు విడతలుగా నవంబర్ 6, 11 తేదీల్లో ఎన్నికలు జరుగనున్నాయి. నవంబర్ 14న ఎన్నికల ఫలితాలు వెలువడతాయి.

## వర్మ 'జీరో' వ్యాఖ్యలపై స్పందించిన మంత్రి నారాయణ




**పిఠాపురం అక్టోబర్ 17 క్రైమ్ కౌంటర్ న్యూస్ :** మాజీ ఎమ్మెల్యే వర్మను జీరో చేశామనే వ్యాఖ్యలపై మంత్రి నారాయణ క్లారిటీ ఇచ్చారు. తన మాటల్ని కట్ పేస్ట్ చేసి తప్పుగా ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈ శుక్రవారం మంత్రి నారాయణను వర్మ విశాఖపట్నంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. 'టెలీ కాన్ఫరెన్స్‌లో నేను మాట్లాడిన మాటలను కట్ పేస్ట్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. నెల్లూరు నాయకులతో మాట్లాడుతూ పిఠాపురంలో ఉన్న సమస్యలను ప్రస్తావించాను.పిఠాపురంలో జనసేన, టీడీపీ ద్వితీయ శ్రేణి మధ్య ఉన్న విభేదాలను చర్చించి 'జీరో' చేశామని నేను చెప్పాను.

2లో

## శ్రీవారి లడ్డూ ధరలపై వదంతులకు ఫుల్‌స్టాప్..

పరిశ్రమల వృద్ధితో రాష్ట్రాభివృద్ధి సాధ్యం: సీఎం

**తిరుమల, అక్టోబర్ 17క్రైమ్ కౌంటర్ న్యూస్ :** తిరుమల శ్రీవారి దర్శనం కోసం ఎక్కడెక్కడి నుంచో భక్తులు కొండకు తరలివస్తుంటారు. తిరుమల శ్రీవారు ఎంత ఫేమస్సో... శ్రీవారి లడ్డూ కూడా అంతే ఫేమస్ అని చెప్పుకోవాలి. శ్రీనివాసుడిని దర్శనం చేసుకున్న తర్వాత శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని ఎంతో పవిత్రంగా భావించి తీసుకుంటారు భక్తులు. అయితే గత కొద్ది రోజులుగా తిరుమల లడ్డూ ప్రసాదం ధరలను పెంచుతారనే ప్రచారం జోరుగా జరుగుతోంది. తిరుమల లడ్డూను పెంచేందుకు టీటీడీ ప్రయత్నాలు చేస్తోందంటూ వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా శ్రీవారి ధరల పెంపు ప్రచారంపై టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు స్పందిస్తూ... ధరల పెంపుపై క్లారిటీ ఇచ్చారు. శ్రీవారి లడ్డూ ధరలను పెంచే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు టీటీడీ ఛైర్మన్. లడ్డూ ధరల పెంపు వార్తలను ఆయన తీవ్రంగా ఖండించారు. కావాలనే కొన్ని ఛానళ్లు పని గట్టుకొని టీటీడీపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. లడ్డూ ధరల పెంపు అంటూ నిరాధార వార్తలను ప్రసారం చేస్తున్నారని అన్నారు. టీటీడీపై కొన్ని ఛానళ్లు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయని ఫైర్ అయ్యారు. లడ్డూ ధరలను పెంచే ఉద్దేశం టీటీడీకి లేదని స్పష్టం చేశారు. టీటీడీ, ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు.





## వర్మ 'జీరో' వ్యాఖ్యలపై స్పందించిన మంత్రి నారాయణ

కంటెంట్ మొత్తం బహిర్గతం చేసి ఉంటే వక్రీకరణలు ఎలా జరిగాయో అర్థం అయ్యేది. వక్రీకరించి విభేదాలు సృష్టించడం ఎవరి వల్ల కాదు. ఎన్డీఏ కూటమి చాలా స్ట్రాంగ్‌గా ఉంది. ఇండిపెండెంట్‌గా 50 వేల ఓట్లతో గెలిచిన బలమైన నాయకుడు వర్మ. పిఠాపురంలో జనసేన, టీడీపీ సమన్వయంతో కలిసి పనిచేస్తున్నాయి' అని అన్నారు.
పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ.. నారాయణ వ్యాఖ్యలపై అభూత కల్పనలు ప్రచారం చేశారన్నారు. పేటీఎం బ్యాచ్ చేసే అసత్య ప్రచారాలను తాను పట్టించుకోనని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీలో తాను పిల్లర్ లాంటి వాడినని అన్నారు. మంత్రి నారాయణ జనసేన టీడీపీ మధ్య కాకినాడ జిల్లాలో వారధిగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కూటమి మధ్య విబేధాలు సృష్టించడం ఎవరి వల్ల కాదని తేల్చి చెప్పారు.

# ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి- జిల్లా కలెక్టర్



**మచిలీపట్నం,( క్రై%శీ% కౌంటర్) అక్టోబర్ 17** ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో ఎంప్లాయిస్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించి పలువురు ఉద్యోగుల నుండి స్వయంగా అర్జీలు స్వీకరించారు. ఉద్యోగులు విన్నవించిన వివిధ సమస్యలను ఆయన ఓపిగ్గా ఆలకించి పరిష్కారంపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ లో మొత్తం 5 దరఖాస్తులు రాగా, వాటిని సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని వాటిని సకాలంలో పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మీకవసరమైన సౌకర్యాలన్నీ కల్పిస్తాం



**క్రైమ్ కౌంటర్ న్యూస్ , అక్టోబర్ 17 క్రిష్ణా :** విజయపురం మండలాన్ని పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చేస్తామని కలెక్టరు సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కోసలనగరంలో పరిశ్రమల ఏర్పాటుపై అంబత్తూరు ఇండస్ట్రియల్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రతినిధులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోసలనగరం పారిశ్రామిక వాడ ఏర్పాటుకు ఎ- బ్లాక్‌లో 1500 ఎకరాల భూమిని గుర్తించామన్నారు. పారిశ్రామిక వాడకు అవసరమైన నీటి సదుపాయం, రోడ్డు, కరెంటు వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. తెలుగుంగ ప్రాజెక్టు ద్వారా నీరు నిరంతరాయంగా సరఫరా చేస్తామన్నారు. పరిశ్రమలకు అవసరమైన భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి స్టాంప్ డ్యూటీని ప్రభుత్వమే భరిస్తుందని వివరించారు. పారిశ్రామిక హబ్‌తో నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం సమస్యలపై పిర్యాదులను స్వీకరించారు. అంబత్తూరు ఇండస్ట్రియల్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రతినిధి, సప్తగిరి హైమా ఇండస్ట్రియల్ పార్కు అధ్యక్షుడు హరిప్రసాద్, ఉపాధ్యక్షుడు ఆర్వేల రమేష్ నాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే భానుప్రకాష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో తామంతా పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చామన్నారు. ఎకరా భూమి ధర రూ.20 లక్షల లోపు అందిస్తామని కలెక్టరు హామీ ఇవ్వడంతో రెండు నెలల్లో ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు.ఆర్డీవో అనుపమ, అర్‌అండ్‌బీ డీఈ సుజాత, తహసీల్దార్ కిరణ్, ఏపీఐఐసీ అధికారులు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కా ధనంజయ యాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు రమేషరాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్, నాయకులు బాలసుబ్రమణ్యం రాజు, లోకేషరాజు తదితరులు పాల్గొన్నారు.

# ధరలు పేలుతున్నాయ్!


2లో

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకించండి

**క్రైమ్ కౌంటర్ న్యూస్ , అక్టోబర్ 17 క్రిష్ణా :** రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో కోటి సంతకాల సేకరణకు సంబంధించిన కరపత్రాలను ఆయ న విడుదల చేశారు. బుగ్గన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ప్రజల ఉన్నతి కోసం గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలొ కొత్తగా 17 మెడికల్ కాలేజీలను నిర్మాణానికి పూనుకుందన్నారు. వీటిలో 7 పూర్తి అయ్యాయని, రాష్ట్రంలో అభివృద్ధే జరగలేదంటూ కూటమి నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ కింద అందించే సేవలు బంద్ అయ్యాయని అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ జరగకుండా ఆపేందుకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని తమ అధినేత వైఎస్ జగన్మోహన రెడ్డి చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన సప్తశైల రాజేష్,




మున్సిపల్ వైస్ చైర్మన జాకీర్ హుశేన, పార్టీ వలంటరీ విభాగపు జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్ డోన పార్టీ పట్టణ, మండల కార్యదర్శులు మల్లికార్జునరెడ్డి, సోమేష్ యాదవ్, దినేషగౌడు పాల్గొన్నారు.

# ఎంఎస్ఎంఈ పార్కుల కోసం కేటాయించిన జిందాల్ భూములు ఇవే



**క్రైమ్ కౌంటర్ న్యూస్ , అక్టోబర్ 17 క్రిష్ణా :** జిల్లాలో పారిశ్రామీకరణ దిశగా అడుగులు పడుతున్నాయి. పరిశ్రమల స్థాపన కోసం ఇప్పటికే సేకరించి ఉన్న భూములపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ భూములను నిరుపయోగంగా ఉంచకుండా వాటిల్లో పరిశ్రమలను నిర్మించేలా చర్యలు చేపడుతోంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) పార్కులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. వాటిల్లో అర్హతను బట్టి స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ పరిశ్రమల స్థాపనకు పెట్టుబడులను ఆకర్షిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే విశాఖపట్నంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ దిగ్గజ సంస్థలు ముందుకు వస్తున్నాయి. నాలుగు రోజుల కిందట గూగుల్‌తో కీలక ఒప్పందం కూడా కుదిరింది. విశాఖకు పక్కనే విజయనగరం జిల్లా ఉండడంతో స్థానిక యువత కొలువులు సాధించేందుకు అవకాశం ఉంటుంది. భోగాపురంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకే కాదు రాష్ట్రానికే తలమానికంగా మారింది. పారిశ్రామిక పెట్టుబడులకు ఒక రకంగా ఇది కారణమవుతుంది. ఐటీ పరిశ్రమల నిర్మాణం కోసం భోగాపురం చుట్టుపక్కల దాదాపు ఐదు వేల ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం చూస్తుంది. వీటికి అనుబంధంగా వివిధ రకాల పరిశ్రమలను నిర్మించేందుకు కృషి చేస్తుంది. వీటికోసం గతంలో పరిశ్రమలకు కేటాయించి నిరుపయోగంగా ఉన్న భూములను అందుబాటులోకి తీసుకువస్తుంది. విశాఖనగరంతో సమానంగా జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసే పనిలో పడింది. ఇప్పటికే పూసపాటిరేగ మండలంలో ఒకట్రెండు రసాయన పరిశ్రమలు, లక్కవరపుకోట మండలంలో పెరున్న ఐరెన్ కంపెనీలు ఉన్నాయి. ఇప్పుడు కొత్తవలస మండలం బలిఘట్టాం, చినరావుపల్లి గ్రామాలతో పాటు శృంగవరపుకోట మండల పరిధిలోని జిందాల్ భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కుల నిర్మాణ ప్రక్రియ ఊపందుకుంది. బొబ్బిలి గ్రోత్ సెంటర్ భూముల్లోనూ పూర్తి స్థాయిలో పరిశ్రమలను నెలకొల్పేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇదంతా కార్యరూపం దాల్చితే జిల్లా చుట్టూ పరిశ్రమలు కనిపించనున్నాయి. పారిశ్రామికీకరణతో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

– శృంగవరపుకోట మండల పరిధిలో గతంలో జిందాల్ సంస్థకు కేటాయించిన 1166.43 ఎకరాల భూముల్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ పార్కులు) నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రూ.531కోట్ల పెట్టుబడితో ఇక్కడ స్థాపించనున్న పరిశ్రమలతో 45వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి.

– బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో 1,150 ఎకరాలు ఉండగా, ఇందులో 300 ఎకరాల్లో మాత్రమే వివిధ రకాల పరిశ్రమలు ఉన్నాయి. మిగిలి ఉన్న స్థలాలపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఇక్కడ పరిశ్రమలను స్థాపించేలా చూస్తుంది. ఇందుకు ముందుకు వచ్చేవారికి స్థలాలు కేటాయించేలా ఆలోచన చేస్తుంది.

– 2017లో కొత్తవలస మండలం చినరావుపల్లి రెవెన్యూ పరిధిలో పతాంజలి ఫుడ్ అండ్ హెర్బల్ ప్రాజెక్టు కోసం 173 ఎకరాల భూమిని అప్పటి టీడీపీ ప్రభుత్వం కేటాయించింది. ఈ యాజమాన్యం పరిశ్రమను స్థాపించేందుకు సిద్ధపడుతున్న సమయంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ సంస్థ ప్రాజెక్టు నిర్మాణానికి ముందుకు రాలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ప్రాజెక్టు నిర్మాణానికి యత్నాలు జరుగుతున్నాయి.

– కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే కొత్తవలస మండలం బలిఘట్టాం గ్రామ పరిధిలోని 57,09 ఎకరాల భూమిలో ఎంఎస్ఎంఈ పరిశ్రమల నిర్మాణానికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి భూమి పూజ చేశారు. ఈ పనులను కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఇటీవల పరిశీలించారు. ఔత్సహక పారిశ్రామిక వేత్తలకు సహకారం అందిస్తామని అన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానంతో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు ు జిల్లా కలెక్టర్





**మచిలీపట్నం,(క్రై%శీ% కౌంటర్) అక్టోబరు 17** సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.
శుక్రవారం కలెక్టరేట్ లోని ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన రహదారి భద్రత కమిటీ సమావేశం జరిగింది. రోడ్డు ప్రమాదాల స్థితిగతులు, రహదారులపై బ్లాక్ స్పాట్లకు తీసుకున్న చర్యలు, డ్రంక్ అండ్ డ్రైవ్, హిట్ అండ్ రన్ మోటార్ యాక్సిడెంట్ కేసులు, ప్రమాదాల నివారణకు సాంకేతిక పరిజ్ఞాన వినియోగం తదితర అంశాలపై ఆయన అధికారులతో చర్చించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులందరూ సమిష్టిగా కృషి చేయాలని, ముఖ్యంగా జిల్లాలోని మచిలీపట్నం%-%విజయవాడ జాతీయ రహదారి నంబర్ 65, జాతీయ రహదారి 216లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రమాదాలకు నిలయమైన బ్లాక్ స్పాట్లను గుర్తించి సమస్యలను పరిష్కరించాలని, అవసరమైన చోట్ల ప్రమాదసూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఏఐ పవర్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎన్నిమార్లు చెప్పినా అమర్చకపోవడం పట్ల ఆయన జాతీయ రహదారుల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఇది సరైనది కాదని హెచ్చరిస్తూ జాతీయ రహదారులపై జరిగే హిట్ అండ్ రన్ కేసులను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తాయని గుర్తు చేశారు.
మచిలీపట్నం నగరంలోని ప్రధాన రహదారులపై యూ టర్న్ తీసుకుని వచ్చే వాహనాలు, అదేవిధంగా ఆ వాహనాలకు ఎదురుగా వచ్చే ఇతర వాహనాలు పరస్పరం ఢీకొని ప్రమాదాలు జరక్కుండా ఉండేందుకు అక్కడ ఏర్పాటు చేసిన బారికేడ్లకు బదులుగా ఎత్తు తక్కువగా ఉండే సిమెంట్ దిమ్మలు ఏర్పాటు చేయాలని, తద్వారా వాహనచోదకుడికి వచ్చే వాహనం కనిపించి ప్రమాదాలు జరక్కుండా ఉంటాయని అన్నారు. అదేవిధంగా జంక్షన్ల వద్ద పని చేయని ట్రాఫిక్ సిగ్నల్స్ ను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్కు సూచించారు.
వాహనం నడిపే సమయంలో డ్రైవర్ ఫోన్ మాట్లాడటం, స్టీరింగ్ సరిగా పట్టుకోకుండా నడపటం, మగతతో వాహనం నడిపినా అప్రమత్తం చేయగల ప్రత్యేక పరికరం పనితీరుపై గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఈ సందర్భంగా డెమో ద్వారా వివరించారు. ఆయన విద్యార్థులను అభినందించి, అవసరానికి తగిన విధంగా మరింతగా అభివృద్ధి చేసి పరికరాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కళాశాల అధ్యాపకుడు డాక్టర్ సురేంద్రకు సూచించారు. వాహనాల్లో ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించే విధంగా ఉన్నతాధికారులతో మాట్లాడి పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జిల్లా ప్రజా రవాణా అధికారికి సూచించారు.
2025 సెప్టెంబరు నెలలో జిల్లాలోని వివిధ ప్రాంతాలలో మొత్తం 63 రోడ్డు ప్రమాదాలు సంభవించగా, వాటిలో 32 మరణాలు, 47 మంది గాయాలపాలయ్యారని, అత్యధికంగా జాతీయ రహదారులపై 20, రాష్ట్ర రహదారులు 5, ఇతర రహదారులపై 7 మరణాలు సంభవించినట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు. వీటిలో అత్యధికంగా ద్విచక్ర వాహనాలు వల్ల 12 మరణాలు, కార్లు, వ్యాన్లు, జీపులు వల్ల 10, లారీలు 5, ట్రాక్టర్లు వల్ల 3 మరణాలు సంభవించినట్లు తెలిపారు.
సమావేశంలో అదనపు ఎస్పి వీవీ నాయుడు, జిల్లా రవాణా అధికారి ఎన్ యు ఎన్ ఎస్ శ్రీనివాస్, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, మచిలీపట్నం నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, రహదారులు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లోకేశ్వరరావు, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆర్ కుముదిని సింగ్, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వెంకట్రావు, జిల్లా ప్రజా రవాణా అధికారి వెంకటేశ్వరులు, జాతీయ, రాష్ట్ర రహదారులు, పోలీసు తదితర శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ధరలు పేలుతున్నాయ్!

**క్రైమ్ కౌంటర్ న్యూస్ , అక్టోబర్ 17 క్రిష్ణా :** దీపావళి సమీపిస్తుండడంతో జిల్లాలో బాణసంచా విక్రయాలు ఊపందుకున్నాయి. హెూల్‌సేల్, రిటైల్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. అయితే, వ్యాపారులు జీఎస్టీని సాకుగా చూపి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో టపాసుల ధరలు పేలుతున్నాయి. సామాన్యులకు అందనంత స్థాయిలో తారాజువ్వాల్లా దూసుకుపోతున్నాయి. రూ.2వేలు తీసుకువెళ్లితే తప్ప సామగ్రి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. గత ఏడాది లక్ష్మీబాంబుల కట్ట(10) రూ.200 ఉండగా ఈ ఏడాది రూ.600 పలుకుతోంది. బ్రాండెడ్ క్రాకర్లు విక్రయించడం లేదు. తక్కువ నాణ్యతకు చెందిన రకాలను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కొక్క బాక్సు రూ.400 వరకు పలుకుతోంది. వాస్తవానికి బాణసంచా విక్రయాలకు సంబంధించి లైసెన్స్ నంబర్, టిన్ నంబర్‌తో ఉన్న రశీదుపై బిల్లులు ఇవ్వాలి. కానీ, తెల్ల కాగితంపై బిల్లు రాసి కొనుగోలుదారులకు ఇస్తున్నారు. లైసెన్స్ దుకాణాల ద్వారా రూ.50 కోట్ల వరకూ అమ్మకాలు సాగుతాయి. ఈ లెక్కన ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం దృష్టిసారించాల్సిన అవసరముంది.

జిల్లాలో ముగ్గురికి మాత్రమే బాణసంచా విక్రయాలకు శాశ్వత లైసెన్స్ ఉంది. వీరు తప్ప ఎవరూ అమ్మకాలు సాగించేందుకు వీలులేదు. కానీ, తాత్కాలిక షాపుల పేరిట అధికారులు అనుమతులు మంజూరు చేస్తున్నారు. ఇప్పటికే వందలాది షాపులకు అనుమతులు ఇవ్వడంతో వారు ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధపడుతున్నారు. వీరు రెండు రోజుల పాటు మందుగుండు విక్రయించుకోవచ్చు. అయితే, జనావాసాల మధ్య, జాతీయ రహదారుల చెంతనే తాత్కాలిక షాపులు ఏర్పాటు చేస్తుండడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. విజయనగరం కేఎల్‌పురంలో షాపులను దూరంగా ఉంచాలని స్థానికులు కోరినా ఫలితం లేకపోయింది. 26వ నంబరు జాతీయ రహదారికి ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇది కూడా ఇబ్బందికరమే.

– బాణసంచా తయారీ, విక్రయ కేంద్రాల వద్ద అసలు నిబంధనలు పాటించడం లేదన్న విమర్శ ఉంది. తయారీ కేంద్రాలు బలంగా ఉండాలి. మంటలు చెలరేగితే ఆర్పేలా సంబంధిత పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలి. 25 వేల లీటర్ల నీటి సామర్థ్యంతో ఒక సంపు నిర్మించుకోవాలి. డీజిల్, ఇంజన్, కార్బన్‌డయాక్సైడ్ గ్యాస్ సిలిండర్లు, పొడి ఇసుకను బకెట్లలో నింపి ఉంచాలి. 15 కిలోలకు మించి మందుగుండు సామగ్రి, నలుగురుకు మించి కూలీలు ఉండకూడదు. అయితే ఇవెక్కడ తయారీ కేంద్రాలు, విక్రయ కేంద్రాల వద్ద కనిపించడం లేదు.

12 మంది వ్యాపారులపై కేసులు

బాణసంచా విక్రయాలకు సంబంధించి కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఇటీవల కీలక ఆదేశాలు జారీచేశారు. నిబంధనలకు విరుద్ధంగా షాపులను ఏర్పాటుచేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో విజయనగరం తహసీల్దార్ కూర్మనాథ్ బాణసంచా తయారీ, విక్రయ కేంద్రాలను బుధవారం తనిఖీ చేశారు. ఇక్కడ పనిచేసే కార్మికులకు వ్యాపారులు బీమా విధిగా కట్టాలి. కానీ, ఈ నిబంధన పాటించని 12 మంది వ్యాపారులపై అధికారులు కేసులు నమోదు చేశారు.

నిబంధనలు పాటించాల్సిందే

జిల్లాలో బాణసంచా విక్రయాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు చేపడితే వ్యాపారులపై చర్యలు తప్పవు. కచ్చితంగా ధరలకు అనుగుణంగానే విక్రయించాలి. తప్పకుండా రశీదులు ఇవ్వాలి. తయారీ, విక్రయ కేంద్రాల వద్ద నిబంధనలు పాటించాలి.

## వైఎస్సార్సీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజి ఎమ్మెల్యే అన్నా



**క్రైమ్ కౌంటర్ న్యూస్ , అక్టోబర్ 17 క్రిష్ణా :.** ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేట్ పరం చేస్తూ కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీవోలకు నిరసనగా ఆ ఉత్తర్వులను వెనువెంటనే రద్దు చేసి ప్రభుత్వమే మెడికల్ కాలేజీల నిర్మాణం,నిర్వహణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా తర్లుపాడు మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే,వైయస్సార్ సీపీ సమన్వయకర్త అన్నా రాంబాబు , పాల్గొన్నారు.కోటి సంతకాల ప్రజా ఉద్యమం ఈ ప్రభుత్వానికి కనువిప్పు కావాలన్నారు...

# కొత్తవలస-కిరండూల్ మధ్య అదనంగా మరో రైల్వే ట్రాక్ నిర్మాణం

**మొత్తం సుమారు 446 కిలోమీటర్లు**

**ఇప్పటివరకూ సుమారు 300 కి.మీ. మేరపనులు పూర్తి**

**2028 నాటికి పూర్తయ్యే అవకాశం**



వాల్తేరు రైల్వే డివిజన్‌కు అత్యధిక ఆదాయం సమకూర్చేది కొత్తవలస–కిరండూల్ (కేకే) లైన్. బచేలిలోని గనుల నుంచి ఐరన్‌ఓర్‌ను ఈ మార్గంలోనే విశాఖపట్నం తీసుకువస్తారు. ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు పంపిస్తారు. ఈ మార్గం కొండలు, గుట్టలు, వాగులు మీదుగా సాగుతుంది. వర్షాలు కురిస్తే రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. కొండల పైనుంచి బండరాళ్లు పడుతుంటాయి. వాటిని యుద్ధ ప్రాతిపదికన తొలగించాల్సి వస్తుంది. ఒకే మార్గం ఉండడం వల్ల పరిశ్రమలకు ఐరన్‌ఓర్ సకాలంలో అందడం లేదు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఈ కేకే లైన్‌ను డబ్లింగ్ చేయాలని (మరో మార్గం అదనంగా) నిర్ణయించారు. సుమారు 446 కి.మీ. పొడవున కొత్త మార్గం వేయాల్సి ఉంది. కొండలను తవ్వి గుహలు, నదులపై వంతెనలు నిర్మించాల్సి వస్తోంది. ఇప్పటివరకూ సుమారు 300 కి.మీ. మేర పనులు పూర్తయ్యాయి. మొత్తం పనులు 2026 మార్చి నాటికి పూర్తి కావలసి ఉండగా, ఇంకో రెండేళ్లు అదనపు సమయం పట్టే అవకాశం ఉందని అధికార వర్గాల సమాచారం. ఇటీవల తరచూ వర్షాలు కురుస్తుండడంతో పనులు ఆగిపోతున్నాయని చెబుతున్నారు.

ఈ సెక్షన్‌లో ఆరు బ్లాకులు ఇంకా నిర్మించాల్సి ఉంది. రెండు స్టేషన్ల మధ్య దూరాన్ని ఒక బ్లాకుగా వ్యవహరిస్తారు. అంటే 12 స్టేషన్ల మధ్య అదనపు ట్రాక్ పనులు పూర్తి కావాల్సి ఉంది. వీటిలో రెండు బ్లాకులు చాలా క్లిష్టమైనవి. టన్నెళ్లు వేయాల్సి ఉంది. ఈ పనులు 2027–28 నాటికి అయ్యే అవకాశం ఉంది. బచేలి–కిరండోల్–కొరాపుట్ మధ్య నాలుగు బ్లాకుల పనులు మిగిలి ఉన్నాయి. వాటిలో ఒక బ్లాక్ ఈ ఏడాది చివరికి పూర్తి కానుంది. మిగిలినవి వచ్చే ఏడాది పూర్తిచేయడానికి యత్నిస్తున్నారు.

ఆరు నెలల్లోనే 48 మిలియన్ టన్నుల రవాణా

లలిత్ బొహ్రా, డీఆర్ఎం, వాల్తేరు

కేకే లైన్ వాల్తేరు డివిజన్‌కు గుండెకాయ లాంటిది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా గత ఏడాది కంటే 21 శాతం సరకు రవాణా పెరిగింది. తొలి ఆరు నెలల్లో 48 మిలియన్ టన్నుల సరకు రవాణా చేశాం. ఎన్ఎండీసీకి ర్యాకుల కొరత రాకూడదని ఇటు నుంచి ఎటువంటి సరకు లేకపోయినా ఖాళీ ర్యాకులను పంపుతున్నాం.

దీపావళిని పురస్కరించుకుని సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శన వేళల్లో స్వల్ప మార్పులు ఉంటాయని ఈఓ వేంద్ర త్రినాథరావు ప్రకటించారు. ఈనెల 20వ తేదీన నరక చతుర్దశి సందర్భంగా రాత్రి ఏడు గంటల వరకూ, అదే విధంగా 21న దీపావళి పండుగ కారణంగా సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమే భక్తులకు స్వామివారి దర్శనాలు లభిస్తాయన్నారు. ఆ రెండు రోజులు రాత్రి ఆరాధన సేవా టికెట్ల విక్రయాలు ఉండవని పేర్కొన్నారు. ఈనెల 22న నృసింహస్వామి ఆవిర్భావ నక్షత్రం స్వాతిని పురస్కరించుకుని ఆలయంలో స్వాతి నక్షత్ర హవనం జరగనున్నందున ఉదయం జరగాల్సిన ఆర్జిత సహస్ర నామార్చన, గరుడ సేవలను రద్దు చేస్తున్నట్టు వెల్లడించారు. ఆర్జిత నిత్యకల్యాణం యథావిధిగా జరుగుతుందన్నారు. అదేవిధంగా ఈనెల 23 నుంచి 27 వరకు మహామునుల తిరునక్షత్ర పూజలను పురస్కరించుకుని సహస్ర తులసీ దళార్చన, గరుడసేవ, నిత్యకల్యాణం, స్వర్ణ పుష్పార్చన వంటి ఆర్జిత సేవలన్నింటినీ రద్దు చేశామన్నారు. ఈ మార్పులను భక్తులు గమనించాలని ఈఓ కోరారు.

# బాణసంచా దుకాణాల ఏర్పాటులో ఇష్టారాజ్యం

**దుకాణానికి దుకాణానికి మధ్య పది అడుగులు దూరం ఉండాలని నిబంధన**

**మూడు అడుగులు మాత్రమే విడిచిపెట్టిన వైనం**

**వ్యాపారుల పేరుతో చక్రం తిప్పుతున్న దళారులు**

**ఇప్పటికీ అనుమతివ్వని పోలీస్ శాఖ**

**చోద్యం చూస్తున్న అగ్నిమాపక, టౌన్‌ప్లానింగ్ అధికారులు**



బాణసంచా దుకాణాల ఏర్పాటులో వ్యాపారులు నిబంధనలకు నీళ్లొదులుతున్నారు. పోలీస్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండానే ఏయూ, అల్వార్‌దాస్ మైదానాల్లో దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. పొరపాటున ప్రమాదం జరిగితే ఆస్తి, ప్రాణనష్టాలు జరగకుండా రెండు దుకాణాల మధ్య కనీసం పది అడుగుల దూరం ఉండాలని నగర పోలీసు కమిషనర్ విడుదల చేసిన ఆదేశాల్లో ఉంది. వీటిని పట్టించుకోకుండా మూడు అడుగుల దూరం మాత్రేమ ఖాళీ ఉంచి దుకాణాలు ఏర్పాటుచేశారు. పోలీసులు క్షేత్రస్థాయిలో పరిశీలించి దుకాణాలకు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటికే ఎడం పాటించకుండా ఏర్పాటుచేసిన దుకాణాల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది. దీపావళి పండగ వస్తే ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానం, ఎంవీపీకాలనీలోని ఏఎస్ రాజా కళాశాల మైదానం, తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున బాణసంచా దుకాణాలు ఏర్పాటుచేస్తారు. దీపావళికి రెండు రోజులు ముందుగా బాణసంచా విక్రయాలు ప్రారంభిస్తారు. అయితే గతంలో బాణసంచా దుకాణాల ఏర్పాటు విషయంలో వ్యాపారులు కాకుండా వైసీపీ నేతలు 'ఫైర్ మర్చంట్స్ అసోసియేషన్' పేరుతో గంపగుత్తగా బినామీ పేర్లతో అనుమతులు తెచ్చుకున్నారు. ఏయూ, ఏఎస్ రాజా కళాశాల మైదానాల్లో వారే దుకాణాలు ఏర్పాటుచేసి వ్యాపారులకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఈ ఏడాది దీపావళికి బాణసంచా దుకాణాల కోసం వ్యాపారులు కాకుండా కూటమి ప్రజా ప్రతినిధి అనుచరులు ఇద్దరు రంగంలోకి దిగారు. గతంలో వైసీపీ నేతల మాదిరిగానే అసోసియేషన్ పేరుతో ఏయూ, ఏఎస్ రాజా మైదానాల్లో దుకాణాల ఏర్పాటుకు బినామీ పేర్లతో దరఖాస్తులు చేశారు. వాటిని జీవీఎంసీ, ప్రాంతీయ అగ్నిమాపక శాఖ, ఈపీడీసీఎల్ అధికారులు పరిశీలించి నిబంధనలు పాటించినట్టు నిర్ధారించుకుని అనుమతులు జారీచేయాల్సి ఉంది. అన్ని శాఖల నుంచి ఎన్‌వోసీలు తీసుకుని దరఖాస్తుకు జతచేసి పోలీస్ శాఖకు అందజేస్తే, వారు పరిశీలించి అనుమతులు జారీచేస్తారు. ఈ ఏడాది ఏయూ ఇంజనీరింగ్, ఏఎస్ రాజా మైదానాల్లో దుకాణాల ఏర్పాటుకు జీవీఎంసీ, అగ్నిమాపక శాఖ, ఈపీడీసీఎల్, పోలీస్ శాఖల నుంచి అనుమతులు జారీకాకుండానే కూటమి ప్రజాప్రతినిధి అనుచరులు దుకాణాల ఏర్పాటు పనులు పూర్తిచేశారు. ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో 126, ఏఎస్ రాజా కళాశాల మైదానంలో 36 దుకాణాలు ఏర్పాటుచేసి ఒక్కోటి రూ.1.2 లక్షలకు వ్యాపారులకు విక్రయించేయడం విశేషం. కొమ్మాదిలో కూడా ఇదే మాదిరి అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటుచేస్తే జోన్–2 టౌన్‌ప్లానింగ్, పోలీస్ అధికారులు వాటిని శుక్రవారం తొలగించారు. కానీ నగరంలో అధికారులు చోద్యం చూస్తుండడం గమనార్హం. అనుమతులు వస్తాయనే ధీమాతో ఒకవేళ ఎవరైనా దుకాణాలు ఏర్పాటుచేసినా అగ్నిమాపక శాఖ అధికారులు వాటిని పరిశీలించి అభ్యంతరాలు ఉంటే వెంటనే సరిచేసేలా ఆదేశించాలి. దుకాణాల వద్ద అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేని విధంగా జాగ్రత్తలు పాటించడంతోపాటు ఏదైనా జరిగితే సకాలంలో మంటలను అదుపుచేయగలిగే పరిస్థితి ఉండేలా చూడాలి. కానీ మూడు అడుగులు దూరంలోనే దుకాణాలు ఏర్పాటుచేస్తుంటే అగ్నిమాపకశాఖ అధికారులు పట్టించుకోకపోవడం ఆ శాఖ పనితీరుకు అద్దంపడుతోంది. పొరపాటున ఏదైనా ప్రమాదం జరిగితే దుకాణాలన్నింటికీ క్షణాల్లో మంటలు వ్యాపించే అవకాశం ఉంది. చుట్టుపక్కల ప్రాంతాల్లోని నివాసాలు, భవనాలకు సైతం ముప్పు పొంచి ఉంటుందనే విషయాన్ని అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని పలువురు హెచ్చరిస్తున్నారు.


# నవంబర్ 3న జరిగే సమ్మెను జయప్రదం చేయండి

**క్రైమ్ కౌంటర్ న్యూస్ , అక్టోబర్ 17 క్రిష్ణా :**రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి నవంబర్ 3వ తేదీ రాష్ట్రవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల యూనియన్ రాష్ట్ర సమితి పిలుపునిచ్చింది. అందులో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ మేనేజర్ కు ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా ఏఐటీయూసీ జిల్లా మాజీ అధ్యక్షులు బూసి సురేష్ బాబు మాట్లాడుతూ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు పెంచాలని తదితర సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల యూనియన్ రాష్ట్రవ్యాప్త సమ్మెను పిలుపునివ్వడం జరిగిందని, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్త సమ్మెతో పాటు స్థానిక మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను సైతం ఈ సమ్మెలో పరిష్కరించాలని డిమాండ్ పెట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కాకుమాని రవణమ్మ మాట్లాడుతూ నవంబర్ మూడో తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో విధులకు హాజరుకాకుండా సమ్మెలో పాల్గొంటామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి వై ఆనందమోహన్ మాట్లాడుతూ కందుకూరు



పా మున్సిపల్ లో పారిశుద్ధ కార్మికులుగా పనిచేస్తున్న కార్మికులు మరణించి రెండు సంవత్సరాలు అవుతున్న ఇప్పటికే వారి ప్లేసులో వారి కుటుంబ సభ్యులకు పని కల్పించలేదని ఇక స్థానికంగా అనేక సమస్యలు ఉన్నాయని ఈ డిమాండ్ తో సమ్మెకు పోవడం జరుగుతుందని అన్నారు. ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పులి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సినిమా



## ఇంత మంచోడివి ఏంటయ్యా.. నడవలేని స్థితిలో చైల్డ్ ఆర్టిస్టు..

దక్షిణాది సినీప్రియులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని పేరు రాఘవ లారెన్స్. కొరియోగ్రాఫర్, దర్శకుడిగా, హీరోగా ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ఇప్పటివరకు ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఒకప్పుడు చిరంజీవి నటించిన ముఠామేస్త్రి సినిమాలోని టైటిల్ సాంగ్ లో గ్రూప్ డ్యాన్సర్లలో ఒకడిగా కనిపించిన లారెన్స్.. ఇప్పుడు ఇండస్ట్రీలో తద్దైన ముద్ర వేశారు. ముఖ్యంగా లారెన్స్ దర్శకత్వం వహించిన కాంచన్ సిరీస్ చిత్రాలకు సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. వరుస సినిమాలతో బిజీగా ఉన్న లారెన్స్.. అటు సామాజిక సేవ కార్యక్రమాలు చేయడంలో ముందుంటారు. సినిమాల ద్వారా వచ్చిన ఆదాయం నుంచి భారీ మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తుంటారు. ఇప్పటికే కష్టాల్లో ఉన్న ఎంతో మందికి అండగా నిలిచారు. చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనాథలు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు సాయం చేస్తుంటారు. అలాగే ఎంతో మంది విద్యార్థులకు స్కాలర్ షిప్స్ ఇస్తూ చదువు కొనసాగించేందుకు తోడ్పడుతున్నారు. తాజాగా నడవలేని స్థితిలో ఉన్న ఒకప్పటి చైల్డ్ ఆర్టిస్టుకు అండగా నిలబడ్డాడు.చిన్న వయసులోనే సినీరంగంలోకి అడుగుపెట్టాడు. ఎన్నో సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్టుగా కనిపించాడు. మాస్ మహారాజా రవితేజ నటించిన విక్రమార్కుడు సినిమాతో ఒక్కసారిగా ఫేమస్ అయ్యాడు. అతడి పేరు రవి రాథోడ్. తెలుగులో అనేక చిత్రాల్లో బాలనటుడిగా కనిపించారు. విక్రమార్కుడు సినిమాలో రవితేజ, రవి రాథోడ్ మధ్య వచ్చే సీన్స్ నవ్వులు పూయిస్తాయి. చిన్నప్పుడు రవి రాథోడ్ తల్లిదండ్రులు మరణించడంతో లారెన్స్ దత్తత తీసుకుని.. మంచి స్కూల్లో చదివించాడు. కానీ చదువు అబ్బలేదు. దీంతో లారెన్స్ కు తెలియకుండా స్కూల్ మానేశాడు. ఆ తర్వాత చిన్న చిన్న పనులు చేసుకుంటూ మద్యానికి బానిసయ్యాడు. ఒక్క రోజు మద్యం తాగకపోతే బతకలేను అనే స్టేజీకి చేరిపోయాడు. దీంతో అతడికి అనారోగ్య సమస్యలు వచ్చాయి. కిడ్నీలో రాళ్లు చేరి సరిగ్గా నడవలేని స్థితికి చేరుకున్నాడు. ఇటీవల రవి రాథోడ్ పరిస్థితి తెలుసుకున్న లారెన్స్.. ఒక్కసారి కలవమని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఎట్టకేలకు చెన్నై వెళ్లి లారెన్స్ ను కలిశాడు రవి రాథోడ్.రవి మద్యం అలవాట్లు తెలిసి అతడిపై కోప్పడ్డాడు. లారెన్స్ కోసం ఎప్పటికీ మందు ముట్టనని మాటిచ్చాడు. ఆయన ఇచ్చిన డబ్బుతో తనకంటూ ఒక ఫోన్ కొనుక్కోని ఇప్పుడు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటున్నాడు. ఇటీవల లారెన్స్ తో దిగిన ఫోటోనూ రవి రాథోడ్ తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దీంతో రాఘవ లారెన్స్ మంచి మనసుపై జనాలు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రస్తుతం రవి రాథోడ్ ఆరోగ్య పరిస్థితి, ఆసుపత్రి చికిత్స విషయాలను లారెన్స్ దగ్గరుండి చూసుకుంటున్నట్లు తెలుస్తోంది.





## అల్లం చేసే ఈ 6 అద్భుతాల గురించి తెలుసా..? తప్పక తెలుసుకోండి..

మనం వంటకాల్లో రుచి కోసం ఉపయోగించే అల్లం.. కేవలం సుగంధ ద్రవ్యం మాత్రమే కాదు.. అద్భుతమైన ఔషధ గుణాలున్న సహజ నివారిణి. ఇందులో ఉండే ముఖ్యమైన యాంటిఆక్సిడెంట్స్, ముఖ్యంగా జింజెరాల్స్, మన శరీరానికి అనేక విధాలుగా మేలు చేస్తాయి. అల్లం అందించే 6 అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు ఇక్కడ ఉన్నాయి:నోటి ఆరోగ్యం, ఫ్రెష్ శ్వాస

అల్లంలో ఉండే జింజెరాల్స్ నోటిలోని హానికరమైన బ్యాక్టీరియా పెరుగుదలను అడ్డుకుంటాయి. ఈ బ్యాక్టీరియాయే చిగుళ్ల ఇన్ఫెక్షన్లు, పీరియాంటల్ వ్యాధులకు కారణం. అల్లం తినడం వల్ల దుర్వాసన తొలగిపోయి, మీ శ్వాస తాజాగా మారుతుంది.

రోగనిరోధక శక్తికి బూస్ట్

అల్లంలో ఉండే బయోయాక్టివ్ సమ్మేళనాలు, ప్రత్యేకించి జింజెరాల్స్, బ్యాక్టీరియా, ఫంగస్‌తో పోరాడే శక్తిని కలిగి ఉంటాయి. దీని యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు శరీర రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అందుకే జలుబు, ఫ్లూ వంటి సమస్యలకు ఇది సమర్థవంతమైన నివారణగా పనిచేస్తుంది.కండరాల నొప్పికి ఉపశమనం వ్యాయామం చేసిన తర్వాత వచ్చే కండరాల నొప్పిని తగ్గించడంలో అల్లం చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. పచ్చి అల్లం తినడం వల్ల శరీరంలో మంట తగ్గుతుంది., దీని ఫలితంగా కండరాల నొప్పి మరియు అలసట నుండి త్వరగా ఉపశమనం లభిస్తుంది.

జీర్ణశక్తి మెరుగు


పచ్చి అల్లం తినడం జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు చేస్తుంది. ఇది జీర్ణ ప్రక్రియను మెరుగుపరచి, అజీర్ణం, గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యల నుండి ఉపశమనం అందిస్తుంది.

గుండెకు రక్షణ

అధ్యయనాల ప్రకారం.. అల్లం రక్త ప్రవాహాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అలాగే శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. దీని ద్వారా అల్లం మన గుండె ఆరోగ్యం మెరుగవడానికి చాలా బాగా తోడ్పడుతుంది.

పీరియడ్స్ నొప్పి నివారణ

పీరియడ్స్ సమయంలో వచ్చే నొప్పి నుండి ఉపశమనం పొందడంలో అల్లం చాలా అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో ఉండే జింజెరాల్ అనే సమ్మేళనం ఈ అసౌకర్యాన్ని తగ్గిస్తుంది. కాబట్టి ఆ సమయంలో నొప్పి నివారణ మాత్రలు వేసుకునే బదులు.. పచ్చి అల్లం నమలడం లేదా అల్లం టీ తాగడం వల్ల నొప్పి నుండి సహజంగా ఉపశమనం లభిస్తుంది. అందుకే, రోజువారీ ఆహారంలో అల్లాన్ని చేర్చుకోవడం ద్వారా ఈ అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.



## కిడ్నీలు రాళ్లు మళ్లీ మళ్లీ వస్తున్నాయా..

మూత్రపిండాలలో రాళ్లు ఏర్పడటం శరీరంలో ఆక్సలేట్స్ అధికం కావటం, అవి మూత్రంలోని కాల్షియంతో కలవడం వలన జరుగుతుంది. అందుకే, రాళ్ల సమస్య ఉన్నవారు ఆహారం విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.తప్పించాల్సిన ఐదు ఆహారాలు, పానీయాలు:

ఆక్సలేట్ అధికంగా ఉంటే: నేషనల్ కిడ్నీ ఫౌండేషన్ పరిశోధన ప్రకారం, పాలకూర, బీట్ రూట్, బాదం, స్విస్ చార్డ్ వంటి అధిక ఆక్సలేట్ ఉన్న పదార్థాల వాడకం పరిమితం చేయాలి. బదులుగా, తక్కువ ఆక్సలేట్ గల దోసకాయ, పుచ్చకాయ, అరటి పండ్లు, క్యాలీఫ్లవర్ వంటి పండ్లు, కూరగాయలు తినవచ్చు.

అధిక ఉప్పు: అధిక సోడియం తీసుకోవడం వలన మూత్రంలో కాల్షియం పెరుగుతుంది. అది రాళ్లు ఏర్పడటానికి దారితీస్తుంది. కాబట్టి ప్రాసెస్ చేసిన ఆహారాలు, ప్యాక్ చేసిన స్నాక్స్, ఫాస్ట్ ఫుడ్ పూర్తిగా నివారించాలి. వంట చేసేటప్పుడు ఉప్పు బదులుగా నిమ్మరసం, మూలికలు, మసాలాలు వాడవచ్చుచక్కెర పానీయాలు: అధిక చక్కెర, ముఖ్యంగా ఫాస్ఫోరిక్ ఆమ్లం ఉన్న కూల్ డ్రింక్స్ మూత్రపిండాలకు హాని కలిగిస్తాయి. చక్కెర కాల్షియంను మూత్రంలోకి ఎక్కువగా పంపుతుంది. ఆర్టిఫిషియల్ స్వీట్నర్స్ ఉన్న పండ్ల రసాలు, ఎనర్జీ డ్రింక్స్, ముఖ్యంగా కోలా లాంటి పానీయాలు తాగకూడదు. ఇంట్లో తయారుచేసిన తాజా పండ్ల జ్యూస్ తాగడం, ఎక్కువ మంచినీరు తీసుకోవడం ఉత్తమం.

రెడ్ మీట్: మాంసంలో, ముఖ్యంగా రెడ్ మీట్, ఆర్గాన్ మీట్, షెల్ ఫిష్‌లలో ప్యూరిన్‌లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు పెంచి, రాళ్లు ఏర్పడే ప్రమాదాన్ని పెంచుతాయి. వీటికి బదులుగా కాయధాన్యాలు, బీన్స్, శనగలు వంటి లీన్ ప్రోటీన్లు, మితమైన చికెన్, చేపలు తీసుకోవడం మేలు.

విటమిన్ సి సప్లిమెంట్లు: మాయో క్లినిక్ అధ్యయనం ప్రకారం, అధిక మోతాదులో విటమిన్ సి సప్లిమెంట్లు వాడటం వలన కొంతమందిలో రాళ్లు ఏర్పడవచ్చు. అందుకే విటమిన్ సి సప్లిమెంట్లు అధికంగా తీసుకోకూడదు. నారింజ, స్ట్రాబెర్రీలు వంటి పండ్లు, కూరగాయల ద్వారా సహజంగా విటమిన్ సి పొందవచ్చు.

## 5 మ్యాచ్‌ల్లో 4 సెంచరీలు.. కట్‌చేస్తే.. జట్టులోకి డేంజరస్ ప్లేయర్..!

భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ అక్టోబర్ 19న ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌కు సిద్ధం కావడానికి టీమిండియా మైదానంలో అవిశ్రాంతంగా కృషి చేస్తోంది. ఇంతలో ఆతిథ్య జట్టుకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ఆల్ రౌండర్ గాయం కారణంగా సిరీస్‌కు దూరమయ్యాడు. ఐదు మ్యాచ్‌లలో నాలుగు సెంచరీలు చేసిన బ్యాట్స్‌మన్ అతని స్థానంలోకి వచ్చాడు. ఈ ఆటగాడు ప్రస్తుతం సగటున 100 కంటే ఎక్కువ పరుగులు సాధించాడు. దీంతో ఊహించని విధంగా లాభం పొందాడు.జట్టులో చోటు దక్కించుకున్న మార్నస్ లాబుస్చాగ్నే..

భారత్‌తో వన్డే సిరీస్‌కు ముందు ఆస్ట్రేలియా జట్టుకు మరో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. గాయం కారణంగా ఆల్ రౌండర్ కామెరాన్ గ్రీన్ జట్టు నుంచి తప్పుకున్నాడు. అతని స్థానంలో వెటరన్ బ్యాట్స్ మన్ మార్నస్ లాబుస్చాగ్నే వచ్చాడు. గత వారం వెస్ట్రన్ ఆస్ట్రేలియా తొలి షెఫీల్డ్ షీల్డ్ మ్యాచ్ సందర్భంగా గ్రీన్ స్వల్ప గాయానికి గురయ్యాడు. క్రికెట్ ఆస్ట్రేలియా గ్రీన్ గాయాన్ని ధృవీకరించింది. ముందు జాగ్రత్త చర్యగా ఆటగాడిని జట్టు నుంచి తొలగించామని, అక్టోబర్ 28న దక్షిణ ఆస్ట్రేలియాతో ప్రారంభమయ్యే తదుపరి షీల్డ్ మ్యాచ్‌కు సకాలంలో తిరిగి వస్తాడని భావిస్తున్నారు. లాబుస్చాగ్నే పునరాగమనం ఆస్ట్రేలియా బ్యాటింగ్‌ను మరింత బలోపేతం చేసింది. అతను ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. మార్నస్ లాబుషాగ్నే అద్భుతమైన ఫామ్‌లో..

కామెరాన్ గ్రీన్ తొలగింపు తర్వాత, మార్నస్ లాబుస్చాగ్నే వన్డే జట్టులోకి తిరిగి వచ్చాడు. షెఫీల్డ్ షీల్డ్ మ్యాచ్ తర్వాత ఈ కుడిచేతి వాటం బౌలర్ అడిలైడ్ నుంచి విమానంలో వెళ్లి మొదటి వన్డేకు ముందు పెర్త్‌లో జట్టులో చేరతాడు. లాబుస్చాగ్నేకి ఈ పునరాగమనం సరైన సమయంలో వచ్చింది. 30 ఏళ్ల ఈ వ్యక్తి తన చివరి 12 ఇన్నింగ్స్‌లలో కేవలం 241 పరుగులు మాత్రమే చేసి పేలవమైన పరుగుల తర్వాత ఈ సంవత్సరం ప్రారంభంలో జట్టు నుంచి తొలగించబడ్డాడు. కానీ, అతని ఇటీవలి దేశీయ ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి.

వన్డే కప్‌లో క్వీన్స్‌ల్యాండ్ తరపున ఆడుతున్న లాబుస్చాగ్నే మూడు ఇన్నింగ్స్‌లలో 79 సగటుతో 237 పరుగులు చేశాడు. వాటిలో రెండు సెంచరీలు ఉన్నాయి. ఆ తర్వాత




అతను షెఫీల్డ్ షీల్డ్‌లో రెండుసార్లు బ్యాటింగ్ చేసి 160, 159 పరుగులు చేశాడు. మాజీ ఆటగాడిని ప్రశంసించిన లాబుస్చాగ్నే..

మార్నస్ లాబుస్చాగ్నే దేశీయ క్రికెట్‌లోకి తిరిగి రావడం అతన్ని యాషెస్ పునరాగమనం అంచున ఉంచింది. అతని పునరాగమనం వెనుక ఉన్న శక్తి మరెవరో కాదు. మాజీ భారత ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్. ఆస్ట్రేలియన్ స్టార్ షెఫీల్డ్ షీల్డ్‌లో సౌత్ ఆస్ట్రేలియాపై 197 బంతుల్లో 159 పరుగులు చేశాడు. ఇది ఐదు మ్యాచ్‌లలో అతని నాల్గవ సెంచరీ. టెస్ట్ క్రికెట్‌లో రెండేళ్ల కష్టతరమైన అనుభవం తర్వాత, అతను నిర్ణయం తీసుకోవడంలో ఇబ్బంది పడ్డాడు. 44.25 స్లో స్ట్రైక్ రేట్‌తో స్కోర్ చేశాడు. యాషెస్ ముందు లాబుస్చాగ్నే ఇప్పుడు ఉత్సాహంగా, నమ్మకంగా కనిపిస్తున్నాడు.

నివేదికల ప్రకారం, లాబుస్చాగ్ సెహ్వాగ్ బ్యాటింగ్ శైలిని అతను తిరిగి ఫామ్‌లోకి రావడానికి ప్రేరణగా పేర్కొన్నాడు. సెహ్వాగ్ విధానం బంతిని నిర్భయంగా ఆడటం అని అతను చెప్పాడు. ఇది నాకు ఒక ముఖ్యమైన అంశం. నా టెక్నిక్ గురించి నేను చాలా స్పష్టంగా, నమ్మకంగా ఉండాలని కోరుకుంటున్నాను. బంతిని చూడటం, దానిని కొట్టడం, నా ఆటను విశ్వసించడం గురించి మాత్రమే ఆలోచిస్తాను అని అతను తెలిపాడు. ఇంకా, లాబుస్చాగ్నే ఆఫ్-స్టంప్ వెలుపల తన బలహీనతను మెరుగుపరచుకోవడానికి కూడా పనిచేశాడు. ఇటీవలి సంవత్సరాలలో బౌలర్లు ఈ బలహీనతను ఉపయోగించుకున్నారని ఒప్పుకున్నాడు. కానీ, అతను ఇప్పుడు ఈ బలహీనతను అధిగమించాడు.




Printed by katikala Vara Prasad. Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .H NO : 21-119, WEST IBRAHIMPATNAM, KRISHNA, ANDHRA PRADESH - 521456.. Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2844. Ph:9849707349 . email:kvp6858@gmail.com.